

ఉద్యోగులకు ఆప్కో డిస్కౌంట్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - కడప

ఆప్కో చేనేత వస్త్రాల అమ్మకాలపై 30 శాతం డిస్కౌంట్ ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు డిస్కౌంట్ కార్డులు పంపిణీ చేసినట్లు ఆప్కో కడప మండల వాణిజ్య అధికారి బి.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ఈ కార్డులను ఉపయోగించి ఆప్కో విక్రయశాలల్లో అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్ పొందాలని తెలిపారు. పట్టణాలలోని ఆప్కో చేనేత వస్త్రాలయం, కలెక్టరేట్ ప్రాంగణం, జమ్మలమడుగు, పులివెందుల, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేటలోని ఆప్కో విక్రయశాలల్లో చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి చేనేతకు చేయూతనివ్వాలని కోరారు. వివిధ రకాల పేరు పొందిన మంగళగిరి, బందరు, రాజమండ్రి, వెంకటగిరి, మాధవరం, చీరాల కాటన్, పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, రెడీమేడ్ షర్ట్స్, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ మొదలగు అన్ని రకాల చేనేత వస్త్రాలు లభిస్తాయని తెలిపారు.

సా..గుతున్న..ఖరీఫ్!

- పదును కోసం ఎదురుచూపు
- కడపలో 14.5, అన్నమయ్యలో 6.34 శాతంలోనే విత్తనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ నత్తనకడన సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. కడప జిల్లాలో జూన్, జూలై మాసాల్లో 28,417 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 4,850 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది కడప జిల్లాలో 30,287 ఎకరాల్లో, అన్నమయ్య జిల్లాలో 8,931 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 14.5 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 6.34 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన 85 నుంచి 93 శాతం పొలమంతా బీళ్లుగా దర్శనమిస్తోంది. ఉభయ జిల్లాల రైతాంగం సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటే సింది. ఖరీఫ్ సాగు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కడప జిల్లాలో వరి సాగు 76,085 ఎకరాలకుగానూ 10,870 ఎకరాలు, వేరుశనగ 14,760 ఎకరాల్లో సాగుకు 2,260 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. పత్తి 59,368 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 6,560 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి నేటి వరకు 8,931 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన జిల్లాలో 6.34 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన వేరుశనగ. జిల్లాలో 93,892 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 4,917 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 5.24 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన పొలమతా బీళ్లుగానే దర్శనమిస్తోంది. ఈ ఏడాది జూన్, జులై మాసాల్లో వర్షాభావం వెంటాడింది. 68.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 21.6 శాతమే నమోదైంది. ఈలెక్కన -68.3 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. గతేడాది జూన్‌లో 102 మి.మీ అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జులైలో 96.7 శాతం సాధారణ వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా, 50.1 శాతం నమోదైంది. ఈలెక్కన -27.0 శాతం లోటు కొనసాగుతుండడం గమనార్హం. అన్నమయ్యలో జూన్‌లో 75.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 26.6 శాతమే కురిసింది. ఈలెక్కన -64.6 శాతం లోటు కొనసాగుతోంది. జులైలో 62.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 42.9 మిల్లీమీటర్లు నమోదు కావడం గమనార్హం. ఈలెక్కన -31.0 మిల్లీమీటర్లు లోటు వర్షపాతం కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప, అన్నమయ్యలో ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాని పరిస్థితుల నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది.



సాగు కోసం పొలం దుక్కులు చేస్తున్న రైతులు

ఖరీఫ్ సీజన్ మందగమనంలో సా..గుతోంది. గతేడాది ఇదేసమయానికి 16.32 శాతం సాగుతో పోల్చితే 14.5 శాతం సాగుతో నిరుత్సాహాన్ని కలిగించింది. 2025-26 జూన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి మాయం కావడం వంటి అనిశ్చితి పరిస్థితులు నెలకొనడంతో రైతాంగం నిరుత్సాహానికి గురైంది. జులై ముగుస్తున్నప్పటికీ సాగు ఊపందుకోని వైనం ఆందోళన కలిగిస్తోంది. జులైలోనైనా ఆశించిన వర్షపాతం కురుస్తుందనే ఆశా భావం సైతం అడియాశలు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి రోజూ కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, చివరికి ఉస్సూరుమనిపించడం పరిపాటిగా మారింది. కడప జిల్లాలో 14.5 శాతం, అన్నమయ్యలో 6.34 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జులై నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో విత్తనం పడాల్సిన తరుణంలో మేఘుడు ఊరించి ఉస్సూరుమనిపిస్తుండడం ఆందోళన నెలకొంది.

ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని అందుకుంటాం

జూన్ నుంచి ఆగస్టు 15 వరకు విత్తనం వేయడానికి అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో జులై మాసంలోనే కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో 30 వేల హెక్టార్లలో వరి, ఇతర పంటలు సాగుకు అవకాశం ఉంది. ఇటువంటి ఆశావహ పరిస్థితుల నేపథ్యంలో లక్ష్యాన్ని సులువుగానే అందుకునే అవకాశం ఉంది.

- బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అట్లూరు

విద్యుత్ వినియోగదారులకు డిస్కంలు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. వినియోగదారులపై మోపిన ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ భారాలను రద్దు చేయాలన్నారు. జగన్ ప్రభుత్వ విధానాలనే చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో 'అదాని స్మార్ట్ మీటర్లు వద్దు-ట్రూఅప్ ఛార్జీలు రద్దు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాషా, మండల కార్యదర్శి ఇ.రమణయ్య మాట్లాడుతూ జగన్ ప్రారంభించిన స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలతో పాటు సెకి ఒప్పందం, అదానికి భూముల అప్పగింత వంటి విధానాలను చంద్రబాబు కూడా కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిద్దరి ప్రభుత్వాలకు తేడా లేదని, ప్రధాని నరేంద్రమోడీ చేతిలో ఇద్దరు కీలుబొమ్మలుగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష పార్టీలు సమరశీల పోరాటం చేయడంతో మమతా బెనర్జీ ప్రభుత్వం బిగించకుండా వెనక్కి తగ్గిందన్నారు. చుట్టుపక్కల రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణలో స్మార్ట్ మీటర్లను బిగించలేదన్నారు. విద్యుత్ భారాల దెబ్బకు విజయనగరం, విశాఖపట్నంలో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు మూత పడ్డాయని, గార్మెంట్ ఫ్యాక్టరీలు సంక్షోభంలో ఉన్నాయని తెలిపారు. ఉన్న స్వదేశీ పరిశ్రమలను మూతవేయిస్తూ, విదేశీ కంపెనీలు ద్వారా ఉపాధి పెంచుతామని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న జెన్‌కో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రయివేట్ నుంచి అధిక ధరతో కొనుగోలు చేస్తూ ప్రజల నెత్తిన ఆ భారాలు మోపుతున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో మరలా మరో విద్యుత్ పోరాటం నడపాల్సిన పరిస్థితిని చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలకొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాగానే బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లపై అదానికి టిడిపి లొంగిపోయిందని తెలిపారు. సెకి ఒప్పందానికి ఈ ప్రభుత్వం కొమ్ము కాస్తుందని విమర్శించారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ అదాని హబ్‌గా మారిపోతుందని విమర్శించారు. ప్రజలతో ఓట్లు వేయించుకున్న వైసిపి, టిడిపి ప్రభుత్వాలు భారాలు మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మహిళా సంఘం నాయకులు దుర్గమ్మ, స్వప్న, లతా, ఉత్తిదారుల సంఘం నాయకులు రవిచంద్ర, వడ్డెర సంఘం నాయకులు గంగయ్య, వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కొండయ్య, శివకుమార్, రవి, సిద్దయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

'అచ్చెన్న' వ్యాఖ్యలు హాస్యాస్పదం

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

స్త్రీ నిధి పథకంపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు నేరుగా మంత్రులతో మాట్లాడిస్తున్నారని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేక రాష్ట్రాన్ని అమ్మాలంటూ కొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులకు సకాలంలో ఎరువులు, పెట్టుబడి సాయం, రుణాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కడప ఎమ్మెల్యే మాధవి అండదండలతోనే తిరుమలేశ్ అవినీతి అరాచకాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గర అవినీతి చేసే వాళ్ళు, వసూలు రాజాలు, భూ కబ్జా దారులు తప్ప తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు ఎవరు లేరని తెలిపారు. తిరుమలేశ్ అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిహెచ్ ఇలియాస్, షఫీ, జైచంద్రారెడ్డి, దాసరి శివ పాల్గొన్నారు.

చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ందరిని రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి అరియర్స్‌ను వెంటనే కార్మికులకు ఇవ్వాలి ఆగస్టు 7న చలో విద్యుత్ సౌధ విజయవాడ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి, యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం శంకరాపురంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.కోటి ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. 20, 25 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. కొత్త ఆపరేటర్లందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని తెలిపారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్ వినియోగించాలని, కార్మికులు అనారోగ్యం పాలైన యాక్సిడెంట్ గురైన ఉచితంగా అన్లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కానందున ఆగస్టు 7వ తేదీన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ సిఐటియు ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కాంట్రాక్టు కార్మికుడు ఈ ఆందోళన, పోరాటంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యునైటెడే ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, నాయకులు మధుసూదన్ నాయుడు, జయ చంద్రారెడ్డి, ధనుంజయరాజు, టిఎల్‌సి బాషా, నాగరాజు, కార్మికులు రాఘవ, మస్తాన్, రాము, హరికృష్ణ, రామాంజనేయులు, సులోచన, మాలతి, గాంధీ, శ్రీనివాసులు, కరీముల్లా, సతీష్, శ్రీనివాసులు, కరీముల్లా, రమేష్, శివయ్య, జిల్లా నాయకులు శివప్రసాద్‌రెడ్డి, శివా నందరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ లిఖిత

ప్రజాశక్తి-కడప అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ లిఖిత అన్నారు. బుధవారం కడప, అన్నమయ్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన వారోత్సవాల రెండో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో కెఒఆర్ఎం కాలేజ్‌లో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. 40 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లిఖిత మాట్లాడుతూ రక్తదానం అనేది పునర్జన్మనివ్వగల శక్తివంతమైన కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలని పేర్కొన్నారు. మహిళలు కూడా ముందుకు రావడం సమాజంలో మారుతున్న ఆలోచనలకు ప్రతిబింబమన్నారు. ప్రిన్సిపల్ లావణ్య మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో మహిళా విద్యార్థులు కూడా చురుకుగా పాల్గొనడం, తాము సమాజానికి సాయం చేయగలమన్న భావనతో ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ప్రాణదాతలుగా నిలవడమన్నారు. ఈ వారం రోజులు నిర్వహిస్తున్న రక్త వారోత్సవాలు ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ తులసి కృష్ణ , కాలేజీ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆజాద్ స్ఫూర్తితో కడప ఉక్కును సాధిద్దాం

ప్రజాశక్తి-బద్వేలు

దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే అమరుడైన యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ జయంతి పురస్కరించుకొని బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బిజెఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ స్వతంత్ర్య పోరాటంలో ఆజాద్ పాత్ర చిరస్మరణీయమన్నారు. దేశం కోసం అమరైనరువంటి త్యాగధనులని కేంద్రం గుర్తించడం లేదన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో కడప ఉక్కు కోసం యువత పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. విభజన చట్టంలో హామీ అయిన కడప ఉక్కు పట్ల కేంద్రం వివక్షత చూపుతున్నదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్‌రెడ్డి, పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** చంద్రశేఖర్ ఆజాద్ జయంతి పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, రాఘవేంద్ర, సుదర్శన్, ఆంజనేయులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

గ్రామీణ రోడ్లకు మహర్దశ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ చేకూరుతున్నదని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. బుధవారం కడప కార్పొరేషన్ 18 వడివిజన్ విశ్వనాథపురంలో రూ.1.26 కోట్ల వ్యయంతో నగరపాలక సంస్థ 15వ ఫైనాన్స్ జనరల్ ఫండ్స్‌తో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విధ్వంసం నుంచి సంక్షేమ పథకాలు, అభివృద్ధి వైపు శరవేగంగా పరుగులు పెట్టిస్తున్న ఘనత సిఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రూ.25 కోట్ల పైన సిసి రోడ్లు వేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ కూడా మట్టి రోడ్డులు లేకుండా చేయాలనే దృక్పథంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇంట్లో ఎంతమందికి ఉంటే ఎంత మందికి తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, పెన్షన్లు పెంచిన ఘనత టిడిపికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప కమిషనర్ మనోజ్ కుమార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, మండల టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, గంధం మోహన్ బాబు సుబ్బిరెడ్డి, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-చెన్నూరు

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైసిపి కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేన్ రామానుజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండపేటలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇస్తామన్న రూ.1500 అమలు చేయలేదని తెలిపారు. ఉచిత బస్సు పథకం, రైతు భరోసా వంటివి అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజలకు బాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, కొండపేట సర్పంచ్ తుంగ చంద్రయాదవ్, ఎంపిటిసి నాగిరెడ్డి కార్తీక్‌రెడ్డి, దాదిరెడ్డి భాగ్యమ్మ, భాస్కర్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలేష్ నోరు అదుపులో పెట్టుకో

ప్రజాశక్తి - కడప

టిఎన్ఎస్ఎఫ్ అని చెప్పుకొని మోసాలు, దందాలు, వసూలు చేసిన తిరుమలేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, నీలాగా పార్టీలు మారి రాలేదని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సాయి దత్త మండిపడ్డాడు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలేశ్ మాట్లాడే విధానం చూస్తే చాలా విడ్డూరంగా ఉందన్నారు. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి మాట్లాడడం సబాబు కాదన్నారు. స్థాయికి తగిన మాటలు మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. నీ అరాచకాలు భరించలేకనే టిడిపి నుండి సస్పెండ్ చేశారని, ఆ పార్టీ పేరు చెప్పుకొని విద్యా సంస్థలను బెదిరించి డబ్బులు వసూలు చేశావని విమర్శించారు. ఎన్నో మోసాలు చేస్తూ వసూలు చేసినా పార్టీ సస్పెండ్ చేసినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సందీప్‌రెడ్డి, కడప నగర విద్యార్థి భాగం అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యక్షులు జబ్బార్, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ నగర్ ఎస్‌సి విభాగం అధ్యక్షులు కంచు పాటి బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిదత్త

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కడప అర్బన్: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆశా కార్యకర్తల కోసం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు ఆశా వర్కర్ల సమస్యలను తెలుసుకున్నామన్నారు. 17 మంది ఆశా కార్యకర్తలు తమ సమస్యలు విన్నవించగా 12 మంది ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించామని చెప్పారు. ప్రతి ఒక్క ఆశా కార్యకర్త ఈ-ఆశ యాప్ ప్రతిరోజు ఓపెన్ చేయాలని, ఐదు ఇండికేటర్స్‌ను అప్లోడ్ చేయాలని తెలిపారు. కిల్కారి సేవల గురించి ప్రతి గర్భిణికి తెలియజేసి, వాటిని ఉపయోగించుకునేల చూడాలని పేర్కొన్నారు. కిల్కారి సేవలను ఉపయోగించుకోవడంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉండాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, వేణు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌ను విమర్శించడం తగదు

ప్రజాశక్తి-కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీలో 25 ఏళ్ల పాటు ఉంటూ ఆ పార్టీ ద్వారా గుర్తింపు పొందిన సతీష్‌రెడ్డి వైసిపి పంచన చేరి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను విమర్శించడం తగదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరంలోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన పార్టీలో ఉండే స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఆ పార్టీ సిద్ధాంతాలను తెలియజేసుకోవచ్చన్నారు. సతీష్‌రెడ్డి సుదీర్ఘకాలంగా టిడిపిలో ఉంటూ ఆ పార్టీ తరుపున పలుమార్లు పోటీ చేసేందుకు టిక్కెట్ ఇవ్వడమే కాకుండా ఎమ్మెల్సీని చేసి క్యాబినెట్ హోదా ఇచ్చిందన్నారు. పులివెందులకు రూ.500 కోట్లు ఖర్చు పెట్టి నీళ్లిచ్చి వైఎస్ కుటుంబం చేయలేని పనిని చంద్రబాబు చేశారన్నారు. పార్టీ మారినంత మాత్రాన రాముడుగా అభివర్ణించిన వ్యక్తి రాక్షసుడు అయిపోయాడన్నారు. ఏ పార్టీలో ఉన్న వారికైనా ప్రత్యర్థులపై రాజకీయ, నిర్మాణాత్మక విమర్శలు చేయవచ్చు గానీ వ్యక్తిగత విమర్శలు చేయరాదన్నారు. చంద్రబాబు, లోకేష్‌పై వ్యక్తిగతంగా విమర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. జగన్‌మోహన్‌రెడ్డి మెప్పుకోసం తన ఇమేజ్ తగ్గించుకోవద్దని, జిల్లా ప్రజలు దీనిని ఆమోదించరని తెలుసుకోవాలన్నారు. తిరుమలేష్ పార్టీ కోసం కష్టపడ్డాడని, తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకోమని స్వచ్ఛందంగా రాజీనామా లేఖ ఇచ్చారన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎండగట్టాలే తప్ప వ్యక్తిగత విమర్శలు చేస్తే మాత్రం పార్టీ, ప్రభుత్వం సహించదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

కడప, చిత్తూరు జట్ల ఘన విజయం



తలపడుతున్న అనంతపురం, చిత్తూరు జట్లు

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-16 వన్డే క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో కడప, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై ఒక వికెట్ తేడాతో కడప జట్టు విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 78 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 140 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 215 పరుగులు చేసింది. ఐదు వికెట్లు నష్టానికి 95 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 66.3 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 155 పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. నెల్లూరు జట్టులోని చైతన్య 4, సుశాంత్ 2, రిత్విక్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఎసిఎ స్టేడియంలో జరిగిన మరొక మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై రెండు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 128 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 184 పరుగులు చేసింది. అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 252 పరుగులు చేసింది. రెండు వికెట్లు నష్టానికి 51 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 74.5 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 197 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మహమ్మద్ శారిక్ 105 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని సంజయ్ మూడు, కిరణ్ కుమార్ రెండు వికెట్లు తీసుకున్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజలకందని సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - వేముల

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంలేదని వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో బుధవారం వేములలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోను గుర్తు చేస్తూ ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసం చేశారని వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి చల్లా గంగాదేవి, సీనియర్ నాయకులు హేమాద్రిరెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర, శివశంకర్‌రెడ్డి, వివిధ ప్రతిభావంతుల అధ్యక్షుడు చాగలేటి భాస్కర్, వెంకట నారాయణ, వెంకట శివారెడ్డి, మండి మాధిరి, మాజీ ఎంపిటిసి రామకృష్ణయ్య, బస్సు సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రమల్లెరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

మండల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపిడిఓ సభా భవనంలో ఎంపిపి అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు పూర్తయిన లబ్దిదారులకు హౌసింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. సచివాలయాలలో సమస్యలపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తహశీల్దార్ సాయినాథ్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ ప్రతిభావంతులు, వృద్ధులకు రేషన్ బియ్యం ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తామన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మురుగునీరు, తాగునీరు, మౌలిక వసతులపై మొదటి ప్రాధాన్యతగా పనులు గుర్తించి వాటిని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో జయభారతి, ఎంఈఓ-2 శరత్, ఆరోగ్యమిత్ర శేఖర్, ఈవోపిఆర్‌డి వెంకట రాముడు, వివిధ శాఖల అధికారులు, సూపర్వైజర్ వసంతకుమార్, మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలు సాగు చేపడుతున్నారని, ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలుపరచాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవి రమణ డిమాండ్ చేశారు. మైదుకూరులో రైతులు, రైతు సేవాసమితి నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారన్నారు. రెండవ సంవత్సరం జరుగుతున్న ఇప్పటి వరకు ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాత సుఖీభవ అమలు తేదీని ప్రభుత్వం ఇప్పటివరకు చెప్పకపోవడం చాలా దారుణమన్నారు. రైతుకు ఇంత అన్యాయం జరుగుతున్న రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకత్వం రైతుల గురించి మాట్లాడకపోవడం దురదృష్టమన్నారు. ఇప్పటికైనా రైతులు తమ హామీ అమలు కోసం రాజకీయాల కతీతంగా ఏకమై ప్రశ్నించి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి నాయకులు మాడిశెట్టి సహదేవుడు, కె.రామ్మోహన్, జీవి సత్రం ఎల్లయ్య, కృష్ణయ్య, కటారు రాఘవేంద్ర, రైతులు ఎల్లంపల్లి సుబ్బారెడ్డి, సైమన్, కత్తి నాగిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు తొలగింపుపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నరహరిపురం గ్రామంలోని ప్రధాన రహదారి నుండి కుందూ నదికి వెళ్లే దారిలో పంట పొలాలకు వెళ్లే దారిని కొంతమంది పూడ్చి వేశారని రైతులు బుధవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పూర్వం నుండి పంట పొలాలకు రాస్తా ఉండేదని, అయితే ప్రస్తుతం రైతులు తులశమ్మ, పుత్తా నాగసుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మరి కొంతమంది రైతులు మంగళవారం రాత్రి జెసిబితో రోడ్డును పూర్తిగా చెడగొట్టారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి పంట పొలాలకు వెళ్లే దారిని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. అయితే ఈ రహదారికి సంబంధించి తహశీల్దార్ రమాకుమారి మాట్లాడుతూ రైతులు తమ పట్టా భూములలో ఎలాంటి రాస్తా లేదని తమ పొలాల్లో ఇతరులు వెళ్లేందుకు అవకాశం లేదని, అందుకు సంబంధించి కోర్టు నుంచి ఉత్తర్వులు కూడా తీసుకువచ్చారని తెలిపారు. పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి దారి సమస్యను పరిష్కరిస్తామనిఆమె తెలిపారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమని మండల విద్యాశాఖ అధికారి నాగ స్వర్ణలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు పంచాయతీ పుల్లూరు యానాది కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ ఉద్యోగి గురుశంకర్ రెడ్డి ఆర్థిక సహకారంతో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షులు శివశంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

A.S.No. 26/2013

1. జి.నాగిరెడ్డి (పోతి వారసులు).
2. జి.లక్ష్మిదేవి, W/o లేటు నాగిరెడ్డి, హిందూ, 55 సం॥లు.
3. జి.@ ఎమ్.విజయలక్ష్మి, D/o లేటు నాగిరెడ్డి, హిందూ, 28 సం॥లు

డోర్ నెం.15/929, మోడంపల్లె వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. **...అప్పిలెంట్లు**

Vs

3. ఎస్.రవీంద్ర కుమార్, S/o వెంకట రమణ, హిందూ, 50 సం॥లు, డోర్ నెం.7/3833-6, కొప్పరపు భూమయ్య కాలనీ, ప్రొద్దుటూరు.
5. కె.భారతి, W/o శంకర్, హిందూ, 40 సం॥లు, డోర్ నెం.18/231, సంజీవకొండయ్య వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

...3, 5వ రెస్పాండెంట్లు

నోటీసు

పై నెంబరు అప్పీలును రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో O.S.No.457/2008 నెంబరు తీర్పును రద్దు కోరి దాఖలు చేసి వుంటున్నారు. అట్టి అప్పీలులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో ఉదయం 10.30 ని॥లకు, 01.08.2025వ తేదీన ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ తెలుపకొనవలెను. లేని యెడల మేర పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, B.Com., B.L.,
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE :: TIRUPATI
O.S.NO. 423 OF 2013

B.Srikanth (died) by his L.R. K.Srividya Reddy **...Plaintiffs**

Vs.

T.Dasaradharami Reddy & others **...Defendants**

Suit summons to the Defendants Nos.9 to 11

To
D9. B.Thandava Krishna
D10. B.Gopala Swamy
D11. B. Lokamanya

Nos.9 to 11 are residing at D.No.401, Silpasadana Apartments, Maruthi Nagar, Shilpa Sadana, Kadapa.

Sirs/Madam,

Please take suit summons in the above suit filed by the plaintiffs for permanent injunction. The above suit stands posted to 05.08.2025 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above said court. In the event of your absence the above matter will be decided exparte.

Date of hearing : 05.08.2025

Sd/- A.RAVEENDRANATHA REDDY
Advocate for Plaintiffs,
Tirupati

చెరువులను తలపిస్తున్న లోతట్టు ప్రాంతాలు



కడప రోడ్డులోని ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలిపిస్తున్నాయి. వర్షపు నీటితో నిండిపోతున్నాయి. వర్షపు నీరు వంకలు ఇతర ప్రాంతాలకు ప్రవహించే ఏర్పాటు లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ముఖ్యంగా కడప రోడ్డులోని సాయినాథపురం, బద్వేల్ రోడ్డులోని సుందరయ్యకాలనీ వద్ద నీరు అధికంగా వచ్చి చేరుతోంది. బద్వేల్ రోడ్డులోని జోసఫ్‌పేట, శాంతినగర్, మహబూబ్ నగర్, మార్కెట్ రోడ్డు, కడప రోడ్డు లోని మసీదు రోడ్డు, రిజిస్టర్ కార్యాలయం రోడ్డు , బస్టాండ్, నంద్యాల రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కాలువల వద్ద నీటి కుంటలు ఏర్పడుతున్నాయి. అందులో పందులు అధికంగా సంచరిస్తున్నాయి. మైదు కూరు మున్సిపాలిటీ పరిధిలో 100 వరకు మురికి కుంటలు ఉన్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. మురికికుంటల్లో దోమలు వృద్ధి చెందుతూ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ మురికి కుంటలు ఆధారం చేసుకొని పందులు అధికంగా తిరుగుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి పందులు ఒక్కసారిగా రోడ్డు దాటుతుండడంతో ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. మున్సిపాలిటీ అధికారులు పలు దఫాలు పందుల యజమానులను పిలిపించి మాట్లాడినప్పటికీ ఉపయోగం లేదు. అందులో పందుల యజమానులను మున్సిపాలిటీ వర్కర్లుగా విధుల్లోకి తీసు కుంటామని ఖచ్చితమైన హామీ లేకపోవడంతో వారు పందుల పెంపకాన్ని వదిలేయడం లేదు. పందులను ఒక చోట సంరక్షించుకోకుండా ఇష్టాను సారంగా వదులుతున్నారు. అవి మురికి కుంటలలో తిరుగుతూ దుర్వాసన వెదజల్లుతూ రోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మున్సిపల్ కార్మికులను అభినందించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మున్సిపాలిటీలో (సిఐటియు అనుబంధ సంఘాల) వర్కర్స్ సభ్యులైన మేసా గోపాల్, బిర్రు బాలచెన్నయ్యను డిఎస్‌పి వెంకటేశ్వర రావు అభినందించారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్లో డిఎస్‌పి మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం రాచంరెడ్డి విజయలక్ష్మి పెద్ద పసుపలమోటు వద్ద పర్సును చేజార్చుకొని ఇంటికి వెళ్లిందన్నారు. ఆమె స్థానిక టీచర్స్ కాలనీలో నివాసం ఉంటూ మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామంలో ఉన్న బ్యాంక్‌కు వెళ్లి తిరిగి ఇంటికి ఆటోలో వస్తూ పెద్దపసుపుల మోటు వద్ద ఆటో దిగుతూ పర్స్‌ను జార విడుచుకుందన్నారు. వెంటనే బాధితురాలు తన భర్తతో వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ పర్స్‌లో రూ.44,500 విలువైన కార్డ్స్ ఉన్నాయని పేర్కొన్నారని తెలిపారు. జమ్మలమడుగు అర్బన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లింగప్ప తమ సిబ్బందికి చెప్పి కొత్తగా ఏర్పాటు చేసిన కెమెరాలలో (కమాండ్ కంట్రోల్) పరిశీలించారన్నారు. ఆ సమయంలో అదే దారిలో వెళ్లే నాగుల కట్టకు చెందిన మేసా ప్రతాప్, దిగువపట్నం కాలనీకి చెందిన బిర్రు బాలచెన్నయ్య కింద పడి ఉన్న పర్స్‌ను తీసుకున్నట్లు గుర్తించామన్నారు. వారు మున్సిపాలిటీలో వర్కర్స్‌గా పనిచేస్తున్నారన్నారు. అడిగిన వెంటనే పర్స్ దొరికిందని స్టేషన్‌కు వచ్చి ఇచ్చారన్నారు. పర్సును బాధితురాలుకు అందజేశారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుల్ నాగేంద్ర పాల్గొన్నారు.



బాధితురాలికి పోగొట్టుకున్న పర్సును అందజేస్తున్న డిఎస్‌పి, సిఐ

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



చీనీ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చీనీ తోటలలో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే ఫలితాలు ఉంటాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హిమకుంట్లలో చీని తోటల్లో వర్షా కాలంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో నీరు అధికంగా ఉండడం, తేమ ఆరక పోవడం వల్ల చెట్లు వేర్లు త్వరగా కుళ్లి పోయి చనిపోతాయని తెలిపారు. చీని చెట్లు దెబ్బ తినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్ల మించి నీరు ఉండకూడదన్నారు. వేరు కుళ్ళు కనిపించిన తోటల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ ఒక లీటర్ నీటికి 5 గ్రాములు చొప్పున కలుపుకొని చెట్ల మొదళ్లలో ఒక్కో చెట్టుకు కలిపిన ద్రావణం 20 లీటర్లు పోసుకోవాలన్నారు. పొలుసు పురుగు, బంక తెగులు ఎక్కువగా ఉండడం వల్ల చెట్లు త్వరగా చనిపోతున్నాయి. వీటి నివారణకు గోనె సంచితో కాండం లేదా చెట్ల బెరడుపై బాగా రుద్దాలన్నారు. అనంతరం భూప్రొఫెజైన్ ఒక లీటర్ నీటికి 2 మిల్లి లీటర్లు లేదా బేనోల్ ఆయిల్ ఒక లీటర్ నీటికి 10 మిల్లి లీటర్ల చొప్పున కలుపుకొని పిచికారీ చేసుకున్నట్లయితే పొలుసు పురుగు శాశ్వతంగా నివారించుకోవచ్చు అన్నారు. అంతకుముందు రైతుల తోటల్లోకి వెళ్లి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ వేస్తే ఆత్మహత్యే శరణ్యం

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామానికి చెందిన గోసుల ఎరుకలయ్యగారి కులాయిరెడ్డి, పద్మావతి దంపతులు బుధవారం ఆత్మహత్య ప్రయత్నం చేశారు. వారు అందించిన వివరాల ప్రకారం.. గ్రామంలో 90/2 సర్వే నెంబర్లు 2.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ పొలంలో తన సోదరుడైన సుధాకర్ రెడ్డి ఎలాంటి అనుమతి లేకుండా బుధవారం జెసిబి సహాయంతో పైపులైను ఏర్పాటు చేసే ప్రయత్నం చేశాడు. పైపులైను ఏర్పాటు చేయద్దని చెప్పినప్పటికీ వినకుండా తన భూమిని జెసిబితో తవ్వి పైపులను ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. చేసేది లేక దంపతులు ఇద్దరు ఆత్మహత్య ప్రయత్నం చేశారు. రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పైపులైను ఏర్పాటును నిలిపివేశారు. ఈ విషయంపై తహశీల్దార్ రమాకుమారి మాట్లాడుతూ పట్టా భూముల్లో పైపులైను ఏర్పాటు చేయాలనుకుంటే వారి అనుమతి తీసుకోవాలన్నారు. ఇరువురు రైతులు అంగీకారంతో పైపులైను ఏర్పాటు చేసుకోవాలి తప్ప, బలవంతంగా చేయకూడదని సూచించారు.



పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతు దంపతులు

'మిషన్ వాత్సల్య'ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మండల పరిధిలోని అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధ పిల్లలు, వీధి పిల్లల బాల్య దుర్వినియోగానికి గురైన పిల్లలు, ఇతర ఆపదలో ఉన్న పిల్లలకు రక్షణ, సంరక్ష, సదుపాయాలు అందించడంపై ఈ పథకం కేంద్రీకృతమై ఉందన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగము మిషన్ వాత్సల్య పథకం అనేది భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సద్భావన మంత్రిత్వంచే ప్రారంభించిన పథకం అన్నారు. కార్యక్రమంలో అధికారులు ముద్రా వివేకానంద రెడ్డి, అంగన్ వాడీ టీచర్స్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

పులివెందుల రూరల్ : మండలంలోని ఈ కొత్తపల్లి రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి అధ్యక్షతన పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు డ్రోన్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు పురుగు మందులు పిచికారి చేస్తే ఖర్చులు ఆదా అవుతాయన్నారు. పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ యామిని లతరెడ్డి మాట్లాడుతూ అరటి పొలానికి మొక్కకు కావాల్సిన పోషకాల కోసం జీవామృతం తయారీ అక్కడే డెమోగా చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేముల : స్థానిక కేకే కొట్టాల గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ప్రభాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు రైతులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ఖరీఫ్ పంటల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సాగులో ఉన్న వేరు శనగపంట దిగుబడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వేరుశనగకు రక్షక పంటగా సజ్జ లేదా జొన్న పంట చిక్కగా వేసుకోవాలని సూచించారు. దీనివల్ల రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. మొవ్వకుళ్లు తెగులు కూడా నివారించబడుతుందన్నారు. జిప్సం ఉపయోగించడం వల్ల నూనెలో గింజ శాతం, నాణ్యత పెరుగు తుందని తెలిపారు. ఎకరాకు 200 కిలోలు జిప్సంతో మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. జింక్ సల్ఫేట్ వచ్చిన వెంటనే లబ్ధిదారులకు చెబుతామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్ఏ రాఘవ, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న నారుమడులలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి దేవి పద్మలత తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం కుచ్చుపాప, అనంతపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నారుమడికి ముందుగా విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కుచ్చుపాపలో ఉన్న చేపల చెరువులను పరి శీలించారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను, కార్యక్రమాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ స్వప్న, రైతులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు 28 నుంచి ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్ని పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జెవీవీ కార్యాలయంలో బుధవారం ఉచిత కోచింగ్ గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి సిజిఎల్ 14,582 పోస్టులు, సిహెచ్ఎస్ఎల్ 3,131 పోస్టులు, ఎంటీఎస్ పోస్టులు పడ్డాయని వీటితోపాటు ఏపీ హైకోర్టు 1621 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ బరోడా 500 పోస్టులు, ఆర్ఆర్బి గ్రూప్ డి 32వేల 438 పోస్టులు, ఏఎల్‌పి 11,558 పోస్టులు, ఐబీపీఎస్ పీవో 5,208 పోస్టుల ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కోచింగ్‌కు రాదలచిన వారు 97053 33305 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో కోచింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, సాయంత్రం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఐదు గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు డాక్టర్ మురుకుటి సూర్యనారాయణ రెడ్డి, హరీష్, రామేశ్వరి, హైమావతి, బాల నరసింహులు, యశ్వంత్, అభిషేక్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎస్.కొండారెడ్డి, వ్యవసాయ అధికారులు

రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అర్హులైన రైతులందరికీ నాణ్యమైన విత్తన వేరుశనగ అందించడమే తమ లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామ సచివాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ, జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా ప్రొద్దుటూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ రైతు సంఘం ద్వారా ఆహారం, పోషకాల భద్రత వంట నూనెలు, నూనె గింజలు జాతీయ పథకం-2025-26 లో భాగంగా రైతులకు వేరుశెనగ విత్తనాలను జేడీఏ చంద్రనాయక్ ఉచితంగా పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో సీజన్ ప్రారంభంలో రైతులకు రాయితీ వేరుశనగ విత్తన కాయలను అందించడం అభినందనీయమన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభపడాలని సూచించారు. కడప జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చంద్రానాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయని, ఈ సమయంలో రైతులు నాణ్యమైన వేరుశనగ విత్తనాలు వాడి మంచి రాబడి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, ఏడిఏ అనిత, అశోక్, ఏవో వరహరి, లక్ష్మణ్, సుస్థిర వ్యవసాయ కేంద్ర స్టేట్ కో-ఆర్డినేటర్ ఆదినారాయణ, ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో పవన్‌కుమార్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై మాట్లాడే అర్హత 'రాచమల్లు'కు లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి లేదని టిడిపి మాజీ ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి కేసు అక్రమం, అన్యాయమని, టిడిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యం ఖూనీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మా ఇంటి మీదికి మీ వీధి రౌడీలను కౌన్సిలర్లను పంపితే అప్పటి సీఐ ఇబ్రహీం నాపై 307 కేసు పెట్టించి అక్రమ అరెస్టు చేయించినప్పుడు ఏమైంది ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. తనపై పెట్టిన కేసు సక్రమమా.. అక్రమమా అనేది చార్జిషీట్ తెస్తే ఆధారాలతో నిరూపిస్తానని తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్రను టీవీ రోడ్డులో కొనసాగించాలంటే దారి వెంట మీ ఫ్లెక్సీలు కట్టి అడ్డుకున్నప్పుడు ఏమైంది ప్రజాస్వామ్యమన్నారు. నీ రాజకీయ భవిష్యత్తుకు ప్రొద్దుటూరు ప్రజలు సమాధి కట్టా రని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. ఎస్‌పి అనుమతితో నీవు చేసిన అవినీతి, అక్రమాలపై శివాలయం సెంటర్లో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - వేముల: అప్పులబాధ తాళలేక ఆత్మహత్య చేసుకుని రైతు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం వేముల మండల పరిధిలోని స్థానిక మబ్బుచింతంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మబ్బుచింతలపల్లె గ్రామానికి చెందిన గంగారపు గంగిరెడ్డి (56) సొంత పొలంతో పాటు కౌలు పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించే వారు. గంగిరెడ్డి పొలం పండించుటకు పెట్టుబడుల నిమిత్తం కొంత డబ్బును అప్పుగా తీసుకొని అరటి తోటను సాగు చేశారు. అందులో తీవ్ర నష్టాలు వచ్చాయి. అప్పులు ఇచ్చినవారు తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో తమ పొలంలోకి వెళ్లి పొలానికి ఉపయోగించే గులికలను తిని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గండిక్షేత్రంలో హుండీ కానుకల లెక్కింపు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమ జిల్లాల్లో పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో రామబాణంతో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు (పరకామణి)ను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. హుండీల ద్వారా రూ.6,55,549 నగదు, 019.000 గ్రాముల బంగారు, మిక్సింగ్ వెండి వస్తువులు 007.000 గ్రాములు కువైట్ దినార్లు 11 అన్నదానం హుండీ ద్వారా రూ.7,453 ఆదాయం వచ్చిదని ఎసి తెలిపారు. అధికారులు, దేవస్థానం ఉద్యోగులందరు రాష్ట్ర ఉన్నతాధికారుల సూచన మేరకు సంప్రదాయ వస్త్రధారణతో పరకామణి నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ జి మల్లికార్జున ప్రసాద్, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, చక్రాయపేట ఎపిజిబి సిబ్బంది, ఆర్కేవ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టోల్‌గేట్ ద్వారా రూ.16 లక్షల ఆదాయం

గండి క్షేత్రానికి వివిధ రకాల వాహనాలు టోల్‌గేట్లు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా రూ.16 లక్షల 10 వేలు హెచ్చుదారునిగా వీరపునాయునిపల్లె మండలం అల్లిదేన గ్రామానికి చెందిన ఎం.అశోక్‌రెడ్డి దక్కించుకున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్ జె వెంకట సుబ్బయ్య తెలిపారు. ఆగస్టు 1 నుండి వచ్చే ఏడాది జులై 31వ తేదీ వరకు వాహనాలు వసూలు చేసుకోవచ్చు అన్నారు. దేవస్థానం వారు నిర్ణయించిన ప్రకారమే టోల్‌గేట్లు వసూలు చేసుకోవాలని, అధిక రేట్లు వసూలు చేస్తే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రావణమాస ఉత్సవాలకు పూల అలంకరణకు టెండర్లు ఎవరు వేయలేదన్నారు. కార్యక్రమంలో చక్రాయపేట ఏపీజీబీ సిబ్బంది, ఆర్కే వ్యాలీ పోలీసులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



అధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు

క్రైం కార్నర్

దాడి ఘటనలో 11 మందిపై కేసు

- నిందితుల్లో ఐదుగురు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని ఇనగలూరులో శనివారం పాత కక్షల నేపథ్యంలో చోటుచేసుకున్న దాడి ఘటనపై 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపురం సమీపంలో ఢీకొట్టిన ఘటనలో దస్తగిరిరెడ్డి (బాబురెడ్డి), ప్రశాంత్‌రెడ్డి మరో 9 మందిపై కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుల్లో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు అయన తెలిపారు. గ్రామంలో భద్రతా పరంగా పరిస్థితిని అదుపులో ఉంచేందుకు శాంతిభద్రతల కోసం పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.